RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

www.nityamnigha.com
RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

NITYAM NIGHA TELUGU DAILY
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

Published From : Warangal
Circulated at : Telangana All Districts



వరంగల్ | సంపుటి 2 | సంచిక 107 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | సోమవారం | 19.10.2026 | పేజీలు : 8

ఎన్హెచ్ఎం ఉద్యోగుల జీతాల్లో కోత..
ప్రభుత్వంపై కవిత ఫైర్

- జీతాలు తగ్గిస్తూ ఇచ్చిన జీవో 1195ను రద్దు చేయాలని కవిత డిమాండ్
- కొందరి ఉద్యోగులకు రూ.4,000 నుంచి రూ.5,000 వరకు జీతాలు తగ్గాయని ఆరోపణ
- సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వానికి హెచ్చరిక



2

ఆర్టీసీలో గెలిచినా దక్కని గుర్తింపు..
సర్టిఫికెట్ కోసం జేఏసీ డిమాండ్

- ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల గెలుపు సర్టిఫికెట్‌పై వివాదం
- ధ్రువపత్రం జారీలో కార్మిక శాఖ జాప్యం చేస్తోందని జేఏసీ విమర్శ
- ఎన్నికల మొదట్నుంచీ అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపణ
- వెంటనే జోక్యం చేసుకోవాలని మంత్రి వివేక్ వెంకటస్వామికి విజ్ఞప్తి



2

జూబ్లీహిల్స్‌లోని 'ఫోర్ ఫాదర్స్' పబ్‌కు
రూ.20 వేల జరిమానా..

- తాగునీటి దుర్వినియోగంపై జలమండలి కఠిన చర్యలు
- జూబ్లీహిల్స్‌లోని ఫోర్ ఫాదర్స్ పబ్‌పై చర్యలు
- పబ్ వాటర్ కనెక్షన్‌ను తొలగించి, ట్యాంకర్ల సరఫరా నిలిపివేత
- నీటి వృథాపై ఫిర్యాదు చేయాలని ప్రజలకు జలమండలి పిలుపు



2

కోల్‌కతా దుర్గా పూజలో
పెను విషాదం
- తొక్కిసలాటలో 19 మంది భక్తుల మృతి

- చోర్‌బాగన్ సర్బోజనిన్ దుర్గా పూజా పందిరి వద్ద ఘటన
- ఈ పూజా పందిరిని ఈ ఏడాది ఉత్తమ పందిరిగా గుర్తించిన ప్రభుత్వం
- భారీ వర్షం కారణంగా ఒక్కసారిగా లోపలికి చొచ్చుకొచ్చిన జనం
- ఘటనపై హైకోర్టు జడ్జి నేతృత్వంలో సిట్ దర్యాప్తునకు ఆదేశం

నిత్యం నిఘా, కోల్‌కతా : కోల్‌కతాలో దుర్గా పూజ వేడుకల్లో పెను విషాదం చోటుచేసుకుంది. ఉత్తర కోల్‌కతాలోని ప్రఖ్యాత చోర్‌బాగన్ సర్బోజనిన్ దుర్గా పూజా పందిరి వద్ద శనివారం సాయంత్రం జరిగిన తొక్కిసలాటలో 19 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 25 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ఎక్కువ మంది మహిళలు, చిన్నారులే ఉన్నారు. ఈ ఘటనతో నగరంలో పండుగ వాతావరణం ఒక్కసారిగా విషాదంలో మునిగిపోయింది. శనివారం దుర్గా సప్తమి కావడంతో చోర్‌బాగన్ పందిరి వద్దకు భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. సాయంత్రం 7:40 గంటల సమయంలో ఒక్కసారిగా భారీ వర్షం మొదలైంది. దీంతో బయట క్యూలో వేచి ఉన్న వేలాది మంది తడవకుండా ఉండేందుకు ఒకేసారి పందిరి లోపలికి చొచ్చుకురావడానికి ప్రయత్నించారు. అదే సమయంలో లోపల ఉన్నవారు బయటకు వచ్చేందుకు ప్రయత్నించడంతో ద్వారం వద్ద తీవ్రమైన ఒత్తిడి ఏర్పడింది. ఇరుకైన దారులు, సరైన వెలుతురు లేకపోవడంతో .....



2

24 గంటల్లో క్షమాపణ చెప్పాలి..
వెలుగు పత్రికకు బీఆర్ఎస్ లీగల్ సెల్ నోటీసులు

- కొండపోచమ్మ కథనంపై మండిపాటు.. 24 గంటల్లో బేషరతు క్షమాపణకు డిమాండ్
- ఆధారాలు లేకుండా వార్తలా?.. పత్రికా ప్రమాణాలను కాలరాశారని ఆగ్రహం
- కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్రలను ఉపేక్షించబోం: సోమ భరత్ కుమార్
- స్పందించకపోతే పరువు నష్టం దావా వేస్తామని లీగల్ సెల్ హెచ్చరిక



2

ముంబైలో తీవ్ర కలకలం
- బాలీవుడ్ హీరో టైగర్ ష్రాఫ్ పై కాల్పులు

- ముంబై జుహులో బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ కారుపై కాల్పులు
- దాడి నుంచి సురక్షితంగా బయటపడ్డ టైగర్, ఆయన డ్రైవర్‌కు గాయాలు
- దాడికి బాధ్యత వహిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్



2

భారత్ మాకు ముఖ్య మిత్రదేశం
- రష్యా ఆయిల్ కొనుగోళ్లపై అమెరికా కీలక వ్యాఖ్యలు

- రష్యా ఇంధన కొనుగోళ్లపై ఆంక్షల నుంచి భారత్‌కు తాత్కాలిక మినహాయింపు
- 60 రోజుల పాటు మినహాయింపు ఇస్తున్నట్టు ప్రకటించిన ట్రంప్ ప్రభుత్వం
- భారత్ ఒక్కసారిగా మారడం కష్టమని అమెరికా వ్యాఖ్య
- భవిష్యత్తులో టారిఫ్‌ల ముప్పు పూర్తిగా తొలగిపోలేదని సంకేతాలు



2

పండగ పూట ఛార్జీల బాదుడు..
ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్

- పండగ స్పెషల్ బస్సుల ఛార్జీల పెంపుపై హరీశ్ రావు విమర్శలు
- సాధారణ బస్సులనే స్పెషల్స్‌గా నడుపుతూ అధిక ఛార్జీలు వసూలు
- స్పెషల్ బస్సులపై 50 శాతం సర్ఛార్జి మాత్రమేనంటున్న టీజీఎస్ఆర్టీసీ



2

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మందగమనం.. తగ్గిన ప్రాపర్టీ రిజిస్ట్రేషన్లు!

- హైదరాబాద్‌లో మందగించిన ప్రాపర్టీ రిజిస్ట్రేషన్లు
- గతేడాదితో పోలిస్తే సెప్టెంబర్‌లో 15 % తగ్గుదల
- పడిపోయిన బడ్జెట్, మధ్యశ్రేణి గృహాల అమ్మకాలు
- కోటి రూపాయల పైబడిన ఇళ్లకే కొనసాగుతున్న ఆదరణ
- మొత్తం లావాదేవీల విలువను నిలబెడుతున్న ప్రీమియం సెగ్మెంట్



నిత్యం నిఘా, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ జోరుకు సెప్టెంబర్ నెలలో కాస్త బ్రేకులు పడ్డాయి. గృహాలకు సంబంధించిన ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ల సంఖ్యలో గత ఏడాదితో పోలిస్తే గణనీయమైన తగ్గుదల నమోదైంది. అయితే, కోటి రూపాయలకు పైబడిన ప్రీమియం ఇళ్ల సెగ్మెంట్ మాత్రం స్థిరమైన డిమాండ్‌తో మార్కెట్‌కు కొంత ఊరటనిచ్చింది. aప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా, తెలంగాణ ప్రభుత్వ రిజిస్ట్రేషన్ల శాఖ డేటాను విశ్లేషించి ఈ వివరాలను వెల్లడించింది. దీని ప్రకారం, 2026 సెప్టెంబర్‌లో హైదరాబాద్ (హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలు కలిపి) పరిధిలో 5,620 నివాస గృహాల రిజిస్ట్రేషన్లు జరిగాయి. గతేడాది ఇదే నెలలో నమోదైన 6,612 రిజిస్ట్రేషన్లతో పోలిస్తే ఇది 15 శాతం తక్కువ. అదేవిధంగా, లావాదేవీల విలువ కూడా 7 శాతం తగ్గి, రూ.4,804 కోట్లు...

2

ఆర్టీసీలో గెలిచినా దక్కని గుర్తింపు.. సర్టిఫికెట్ కోసం జేఏసీ డిమాండ్

మొదటిపేజీ తరువాయి.. టీజీఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన తమకు ధ్రువీకరణ పత్రం (విక్టరీ సర్టిఫికెట్) అందజేయడంలో కార్మిక శాఖ జాప్యం చేస్తోందని టీజీఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆరోపించింది. ఎన్నికల్లో గెలుపొందిన తమకు వెంటనే సర్టిఫికెట్ జారీ చేయాలని డిమాండ్ చేస్తూ జేఏసీ నేతలు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల జరిగిన ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ), తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ), నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ)లతో కూడిన జేఏసీ కూటమి ఘన విజయం సాధించింది. అయితే, ఎన్నికల ఫలితాలు వెలువడి అనేక రోజులు గడుస్తున్నా కార్మిక శాఖ అధికారులు ధ్రువీకరణ పత్రం ఇవ్వకుండా అనవసరంగా ఆలస్యం చేస్తున్నారని జేఏసీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచే కార్మిక శాఖ అధికారులు తమకు అడ్డంకులు సృష్టిస్తున్నారని జేఏసీ నేతలు తమ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయంలో కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి వెంటనే జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని జేఏసీ విజ్ఞప్తి చేసింది. కార్మిక శాఖ అధికారులు ఉద్దేశపూర్వకంగానే తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వారి వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని నేతలు స్పష్టం చేశారు.

ముంబైలో తీవ్ర కలకలం

బాలీవుడ్ హీరో టైగర్ ష్రాఫ్ పై కాల్పులు..

మొదటిపేజీ తరువాయి.. బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ ప్రయాణిస్తున్న కారుపై కాల్పుల ఘటన ముంబైలో తీవ్ర సంచలనం సృష్టించింది. ఆదివారం సాయంత్రం జుహు ప్రాంతంలో జరిగిన ఈ దాడిలో ఆయన తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఈ ఘటనలో టైగర్ ష్రాఫ్‌కు ఎలాంటి గాయాలు కాలేదని, అయితే ఆయన డ్రైవర్ గాయపడ్డారని ముంబై పోలీసులు ధ్రువీకరించారు. వివరాల్లోకి వెళితే, ఆదివారం సాయంత్రం ఫుట్‌బాల్ ఆడి తన జీఎండబ్ల్యూ కారులో ఇంటికి తిరిగి వస్తుండగా ఈ దాడి జరిగింది. జుహు పోలీస్ స్టేషన్ పరిధిలోని పుష్పా పార్క్ సమీపంలోకి రాగానే, మోటార్‌సైకిల్‌పై వచ్చిన ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు ఆయన కారును లక్ష్యంగా చేసుకుని మూడు నుంచి ఐదు రౌండ్ల కాల్పులు జరిపారు. ఈ ఘటనలో టైగర్ ష్రాఫ్ సురక్షితంగా ఉండగా, ఆయన కారు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం నానావతి ఆసుపత్రికి తరలించారు. ఈ దాడిలో సమీపంలో ఉన్న ఒక ఆటో డ్రైవర్‌కు కూడా గాయాలైనట్లు సమాచారం. ఘటన గురించి తెలియగానే ముంబై పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. డీసీపీ మోహిత్ గార్గ్ సహా ఉన్నతాధికారులు పరిస్థితిని సమీక్షించారు. టైగర్ ష్రాఫ్ సురక్షితంగా ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. పోలీసులు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని, నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. దుండగులను పట్టుకోవడానికి దాదాపు 12 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు.

పండగ పూట ఛార్జీల బాదుడు.. ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్

మొదటిపేజీ తరువాయి.. బతుకమ్మ, దసరా పండగల వేళ తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ ఛార్జీలు పెంచి ప్రజలపై తీవ్ర భారం మోపుతోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. పండగకు సొంతూళ్లకు వెళ్లేవారి ఉత్సాహాన్ని ఈ ఛార్జీల పెంపు దెబ్బతీసిందని ఆయన ఆరోపించారు. ఛార్జీల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సాధారణ సర్వీసులను తగ్గించి, వాటినే పండగ స్పెషల్ బస్సులుగా చూపిస్తూ అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారని హరీశ్ రావు మండిపడ్డారు. జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు సాధారణ టికెట్ ధర రూ. 230 ఉండగా, ఇప్పుడు రూ. 400 వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. అలాగే మహబూబ్‌నగర్ నుంచి ఎంజీబీఎస్‌కు రూ. 220 ఉన్న టికెట్‌ను రూ. 290కి పైగా పెంచారని తెలిపారు. ఇదేనా మీ ప్రజా పాలన? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అయితే, ఈ ఛార్జీల పెంపు కేవలం పండగ రద్దీ కోసం నడుపుతున్న 7,000 ప్రత్యేక బస్సులకు మాత్రమే వర్తిస్తుందని టీజీఎస్ఆర్టీసీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. సాధారణ సర్వీసుల్లో ఛార్జీలు యథాతథంగానే ఉన్నాయని తెలిపాయి. పండగ సమయంలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చిన తర్వాత బస్సులు ఖాళీగా తిరిగి రావడం వల్ల అయ్యే నిర్వహణ ఖర్చులను భర్తీ చేసేందుకు ఈ 50 శాతం సర్ఛార్జి విధిస్తున్నట్లు అధికారులు వివరిస్తున్నారు. 2003లో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వు (జీవో ఎంఎస్ నెం. 16) ప్రకారమే ఈ సర్ఛార్జిని వసూలు చేస్తున్నామని, ఇది కొత్త విధానం కాదని టీజీఎస్ఆర్టీసీ చెబుతోంది. అయినప్పటికీ, పండగ వేళ ఛార్జీల పెంపు సరైంది కాదని ప్రతిపక్షాలు విమర్శిస్తుండటంతో ఈ అంశంపై రాజకీయంగా చర్చ మొదలైంది.

జూబ్లీహిల్స్‌లోని 'ఫోర్ ఫాదర్స్' పబ్‌కు రూ.20 వేల జరిమానా..

మొదటిపేజీ తరువాయి.. హైదరాబాద్ మహానగరంలో తాగునీటి దుర్వినియోగాన్ని అరికట్టే దిశగా జలమండలి కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా జూబ్లీహిల్స్‌లోని ఓ ప్రముఖ పబ్‌పై భారీ జరిమానా విధించడంతో పాటు, నీటి కనెక్షన్‌ను తొలగించి తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. నీటి వృథా విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని ఈ చర్యల ద్వారా స్పష్టం చేసింది. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45లో ఉన్న 'ఫోర్ ఫాదర్స్ పబ్' తాగునీటిని విపరీతంగా దుర్వినియోగం చేస్తున్నట్లు జలమండలికి ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన విజిలెన్స్ అధికారులు, క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టారు. పబ్‌లో నీటిని వృథా చేస్తున్నట్లు తనిఖీల్లో నిర్ధారణ కావడంతో, యాజమాన్యానికి రూ.20 వేల జరిమానా విధించారు. అంతటితో ఆగకుండా, ఆ పబ్ తాగునీటి కనెక్షన్‌ను శాశ్వతంగా తొలగించారు. అంతేకాక, జలమండలి ఫిల్లింగ్ స్టేషన్ల నుంచి కమర్షియల్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను కూడా నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. వచ్చే ఏడాది వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకే ఈ కఠిన చర్యలు చేపట్టినట్లు జలమండలి స్పష్టం చేసింది. ప్రతి నీటి చుక్కనూ పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ముఖ్యంగా హోటళ్లు, రెస్టారెంట్లు, పబ్‌లు వంటి వాణిజ్య సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నీటి వృథాకు పాల్పడితే ఇలాంటి చర్యలే కొనసాగుతాయని హెచ్చరించింది.

భారత్ మాకు ముఖ్య మిత్రదేశం

- రష్యా ఆయిల్ కొనుగోళ్లపై అమెరికా కీలక వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి.. భారత్ అమెరికాకు అత్యంత ముఖ్యమైన మిత్రదేశమని, ఇంధన అవసరాల కోసం రష్యాపై ఆధారపడటాన్ని ఒక్క రోజులో మార్చుకోవడం కష్టమని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో వ్యాఖ్యానించారు. రష్యా నుంచి భారీగా ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటున్న భారత్‌కు అమెరికా తాత్కాలిక ఊరట కల్పిస్తూ అమెరికా నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో రుబియో ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యాపై విధించిన ఆంక్షల చట్టం నుంచి భారత్ సహా కొన్ని దేశాలకు 60 రోజుల పాటు మినహాయింపు ఇస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం 'లిండ్సే ఓ గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్' కింద ఈ వెయివర్‌పై సంతకం చేశారు. ఈ చట్టం ప్రకారం, రష్యా నుంచి అధిక మొత్తంలో చమురు, గ్యాస్ కొనుగోలు చేసే టాప్ 5 దేశాల (భారత్, చైనా సహా) నుంచి అమెరికాకు దిగుమతి అయ్యే వస్తువులపై 100 శాతం వరకు టారిఫ్‌లు విధించే అధికారం ఉంది. అయితే, జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ట్రంప్ ఈ నిబంధనలను తాత్కాలికంగా నిలిపివేశారు. శనివారం వాషింగ్టన్‌లో విలేకరులతో మాట్లాడిన మార్కో రుబియో, ఈ నిర్ణయం వెనుక గల కారణాలను వివరించారు. "ఈ ఆంక్షలు కేవలం రష్యాపైనే కాదు. భారత్ వంటి ఇతర దేశాలపైనా టారిఫ్‌ల రూపంలో ప్రభావం చూపుతాయి. అందుకే అధ్యక్షుడు 60 రోజుల సమయం తీసుకుని, ప్రపంచ, అమెరికా ఆర్థిక వ్యవస్థలపై పడే ప్రభావాన్ని అధ్యయనం చేయాలని భావిస్తున్నారు" అని తెలిపారు. భారత్ ఇంధన వనరులను వైవిధ్యపరుచుకుంటున్నప్పటికీ, రష్యా నుంచి ఇంకా గణనీయమైన మొత్తంలో ఇంధనాన్ని కొనుగోలు చేస్తోందని, ఇది ఒక్కరోజులో మారే ప్రక్రియ కాదని ఆయన స్పష్టం చేశారు. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా నుంచి చౌకగా ముడి చమురు లభించడంతో భారత్ భారీగా దిగుమతులను పెంచుకుంది. ప్రస్తుతం భారత్‌కు రష్యానే అతిపెద్ద చమురు సరఫరాదారుగా ఉంది. అయితే, తమ ఇంధన భద్రత కోసం వివిధ దేశాల నుంచి మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా కొనుగోళ్లు జరుపుతామని భారత్ ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేసింది. ప్రస్తుతం ఉజ్బెకిస్థాన్, భారత్ పర్యటనలో ఉన్న రుబియో, భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌తో సమావేశమై, జామ్‌నగర్‌లోని రిఫైనరీని సందర్శించనున్నారు. ఈ 60 రోజుల అధ్యయనం తర్వాత అమెరికా తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతానికి ఈ మినహాయింపు భారత్‌కు ఉపశమనం కలిగించినప్పటికీ, భవిష్యత్తులో టారిఫ్‌ల ముప్పు పూర్తిగా తొలగిపోలేదని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఎన్హెచ్ఎం ఉద్యోగుల జీతాల్లో కోత.. ప్రభుత్వంపై కవిత ఫైర్

మొదటిపేజీ తరువాయి.. నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల జీతాలను తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 1195పై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది అత్యంత అన్యాయమైన చర్య అని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకుని ఈ నిర్ణయాన్ని సమీక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఎన్హెచ్ఎం ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17,000 మంది ఎన్హెచ్ఎం ఉద్యోగులు పనిచేస్తుండగా, తాజా జీవో కారణంగా కొందరి జీతాల్లో రూ.4,000 నుంచి రూ.5,000 వరకు కోత పడిందని కవిత ఆరోపించారు. ధరలు, ద్రవ్యోల్బణం పెరుగుతున్న ఈ క్లిష్ట సమయంలో జీతాలు తగ్గించడం ఎంతవరకు సమంజసమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కొందరికి జీతాలు పెంచి, మరికొందరికి తగ్గించడంలో వివక్ష కనిపిస్తోందని ఆమె విమర్శించారు. కేంద్రం ఎన్హెచ్ఎం జీతాల కోసం నిధులు ఇస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం వాటిని సకాలంలో విడుదల చేయడం లేదని ఆరోపించారు. ఎన్నికల ముందు ఎన్హెచ్ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు వారికి న్యాయం చేయడం లేదని కవిత విమర్శించారు. కాంగ్రెస్ పాలిత హిమాచల్ ప్రదేశ్‌తో సహా ఏడు రాష్ట్రాలు ఇప్పటికే ఎన్హెచ్ఎం సిబ్బందిని పర్మినెంట్ చేశాయని గుర్తుచేశారు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా 30 శాతం జీతాలు పెంచి, వారిని క్రమబద్ధీకరించాలని అసెంబ్లీలో తీర్మానం చేసిందన్నారు. గ్రామీణ ఆరోగ్య వ్యవస్థ, వ్యాక్సినేషన్ కార్యక్రమాల్లో ఎన్హెచ్ఎం ఉద్యోగుల పాత్ర కీలకమని కవిత నొక్కి చెప్పారు. ఉద్యోగులు నిరసన తెలిపేందుకు అనుమతి నిరాకరించడం, ఆరోగ్య మంత్రి అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీతాలు పెంచడంతో పాటు, ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో, ఉద్యోగులకు మద్దతుగా తమ సంస్థ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని ఆమె హెచ్చరించారు.

24 గంటల్లో క్షమాపణ చెప్పాలి.. వెలుగు పత్రికకు బీఆర్ఎస్ లీగల్ సెల్ నోటీసులు

మొదటిపేజీ తరువాయి.. బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రతిష్ఠను దెబ్బతీయడంతో పాటు, బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులపై ప్రజల్లో అపోహలు సృష్టించడమే లక్ష్యంగా వెలుగు దినపత్రిక రాజకీయ దురుద్దేశపూరిత కథనాన్ని ప్రచురించిందని భారత రాష్ట్ర సమితి తీవ్రంగా ఖండించింది. అక్టోబర్ 17న మొదటి పేజీలో ప్రచురించిన 'కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు మళ్లిన కొండపోచమ్మ' అనే తప్పుడు కథనాన్ని వెంటనే ఉపసంహరించుకొని, బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ, లీగల్ సెల్ ఇన్‌ఛార్జ్ సోమ భరత్ కుమార్ వెలుగు యాజమాన్యానికి, ఎడిటర్‌కు నోటీసులు జారీ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా సాగునీటి అవసరాలు, కొండపోచమ్మ సాగర్, కాలువల మార్గాలను కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంతో ముడిపెడుతూ ప్రచురించిన ఈ కథనానికి అధికారిక ఆధారాలేమిటని బీఆర్ఎస్ ప్రశ్నించింది. సాగునీటి శాఖ రికార్డులను పరిశీలించారా? కాలువల వాస్తవ మార్గాలను ధ్రువీకరించారా? సంబంధిత అధికారుల నుంచి వివరణ తీసుకున్నారా? అన్న ప్రశ్నలకు సమాధానాలు లేకుండా సంచలనాత్మక శీర్షికలతో ఆరోపణలు ప్రచురించడం జర్నలిజం ప్రమాణాలకు విరుద్ధమని పేర్కొంది. కేసీఆర్ పేరును ఉపయోగించుకొని వివాదాలు సృష్టించడం, బీఆర్ఎస్‌పై బురదజల్లడం, గత ప్రభుత్వం చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులను అప్రతిష్ఠపాలు చేయడం ద్వారా రాజకీయ ప్రయోజనాలు పొందాలనే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని పార్టీ తెలిపింది. వార్తాపత్రికను రాజకీయ ప్రచారానికి వేదికగా మార్చి, పత్రికా స్వేచ్ఛ ముసుగులో నిరాధార ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించింది. బీఆర్ఎస్ పత్రికా స్వేచ్ఛను గౌరవిస్తుందని, ప్రభుత్వాలను, రాజకీయ నాయకులను ప్రశ్నించే హక్కును సమర్థిస్తుందని స్పష్టం చేసింది. అయితే ఆ స్వేచ్ఛకు బాధ్యత కూడా ఉండాలని, వ్యక్తుల ప్రతిష్ఠను దెబ్బతీసే ఆరోపణలకు తగిన ఆధారాలు ఉండాలని పేర్కొంది. తెలంగాణ సాగునీటి రంగంపై వాస్తవాల ఆధారంగా చర్చించాల్సింది పోయి, రాజకీయ ప్రయోజనాల కోసం వార్తలను వక్రీకరించడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని మండిపడింది. వెలుగు యాజమాన్యం, ఎడిటర్ నోటీసులు అందిన 24 గంటల్లోగా వివాదాస్పద కథనాన్ని ఉపసంహరించుకోవాలని, అందులో చేసిన ఆరోపణలకు ఆధారాలతో కూడిన వివరణ ఇవ్వాలని, కేసీఆర్ గారికి, బీఆర్ఎస్ పార్టీకి బేషరతుగా క్షమాపణ చెప్పాలని సోమ భరత్ కుమార్ డిమాండ్ చేశారు. క్షమాపణను మొదటి పేజీలో తగిన ప్రాధాన్యంతో ప్రచురించడంతో పాటు, డిజిటల్ వేదికలు, అధికారిక సామాజిక మాధ్యమ ఖాతాల్లోనూ వెల్లడించాలని నోటీసుల్లో స్పష్టం చేశారు. గడువులోగా స్పందించకపోతే పరువు నష్టం సహా వర్తించే చట్టాల ప్రకారం సంబంధిత సంస్థ, వ్యక్తులపై న్యాయపరమైన చర్యలు చేపడతామని బీఆర్ఎస్ లీగల్ సెల్ హెచ్చరించింది. కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రచారాన్ని, తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులపై రాజకీయ దుష్ప్రచారాన్ని పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోదని స్పష్టం చేసింది.

కోల్‌కతా దుర్గా పూజలో పెను విషాదం.. తొక్కిసలాటలో 19 మంది భక్తుల మృతి

మొదటిపేజీ తరువాయి.. పరిస్థితి అదుపుతప్పి తొక్కిసలాటకు దారితీసింది. ఊపిరాడకపోవడం వల్లే ఎక్కువ మంది మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఘటన జరిగిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక, విపత్తు నిర్వహణ బృందాలు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి. గాయపడిన వారిని కలకత్తా మెడికల్ కాలేజ్ ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి, ఉన్నతాధికారులు ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం, మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి గ్రూప్-డి ప్రభుత్వ ఉద్యోగం ప్రకటించారు. గాయపడిన వారికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం, పూర్తి చికిత్స ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. ఘటనపై కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ జరుపుతుందని సీఎం ఆదేశించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం ఈ ఘటనపై స్పందించి, పీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున పరిహారం ప్రకటించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పలువురు జాతీయ నేతలు సంతాపం తెలిపారు. ఘటనకు బాధ్యత వహిస్తూ పూజా కమిటీ నిర్వాహకులు రాజీనామా చేశారు. పోలీసులు కొందరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. 91 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ పూజా పందిరిని ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ పందిరిగా గుర్తించడం గమనార్హం.

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మందగమనం.. తగ్గిన ప్రాపర్టీ రిజిస్ట్రేషన్లు!

మొదటిపేజీ తరువాయి.. నుంచి రూ.4,487 కోట్లకు చేరింది. ఆగస్టు 2026 నెలతో పోల్చినా కూడా రిజిస్ట్రేషన్లలో 5 శాతం క్షీణత కనిపించింది. ఈ తగ్గుదల ప్రధానంగా బడ్జెట్, మధ్యశ్రేణి గృహాల విభాగంలో ఎక్కువగా కనిపించింది. ₹50 లక్షల లోపు విలువైన ఇళ్ల రిజిస్ట్రేషన్లు ఏకంగా 20 శాతం పడిపోగా, రూ.50 లక్షల నుంచి రూ.1 కోటి మధ్య ఉన్న ఇళ్ల రిజిస్ట్రేషన్లు 6 శాతం తగ్గాయి. అయితే, దీనికి పూర్తి భిన్నంగా ప్రీమియం సెగ్మెంట్ నిలకడగా రాణించింది. కోటి రూపాయలకు పైబడిన విలువైన ఇళ్ల రిజిస్ట్రేషన్లు 12 శాతం తగ్గినా, వాటి లావాదేవీల విలువలో క్షీణత కేవలం 2 శాతంగానే ఉండటం గమనార్హం. మొత్తం లావాదేవీల విలువలో ఈ సెగ్మెంట్ వాటా గతేడాది 54 శాతం ఉండగా, ఈసారి అది 56 శాతానికి పెరిగింది. ఇది మార్కెట్‌లో అధిక విలువ గల గృహాలకు డిమాండ్ బలంగా ఉందని సూచిస్తోంది. సెప్టెంబర్ నెలలో అమ్మకాలు మందగించినప్పటికీ, 2026 క్యాలెండర్ సంవత్సరంలో మొదటి తొమ్మిది నెలల (జనవరి-సెప్టెంబర్) గణాంకాలను పరిశీలిస్తే మార్కెట్ నిలకడగానే ఉంది. ఈ తొమ్మిది నెలల్లో మొత్తం 55,715 యూనిట్లు రిజిస్టర్ కాగా, లావాదేవీల విలువ గతేడాది కంటే 4 శాతం పెరిగి రూ.39,910 కోట్లుగా నమోదైంది. ఈ ఏడాది ఆరంభంలో ప్రభుత్వం గైడెన్స్ విలువల సవరణ తర్వాత నెలవారీ రిజిస్ట్రేషన్లలో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. నైట్ ఫ్రాంక్ ఇండియా ప్రతినిధి శిశిర్ బైజాల్ మాట్లాడుతూ, "మొత్తం రిజిస్ట్రేషన్ల సంఖ్యలో తగ్గుదల ఉన్నప్పటికీ, అధిక ధర కలిగిన ఇళ్ల అమ్మకాల వాటా పెరగడం వల్ల మొత్తం లావాదేవీల విలువ స్థిరంగా ఉంది. ఇది ప్రీమియం గృహాలకు కొనుగోలుదారుల నుంచి డిమాండ్ కొనసాగుతోందని స్పష్టం చేస్తోంది" అని వివరించారు. రిజిస్టర్ అయిన ప్రాపర్టీలలో 66 శాతం వాటాతో 1,000 నుంచి 2,000 చదరపు అడుగుల మధ్య ఉన్న ఇళ్లే అధికంగా ఉన్నాయి.

రంగశాయిపేటలో రావణవధకు సర్వం సిద్ధం

- 36 అడుగుల రావణ ప్రతిమ.. మిరుమిట్లు గొలిపే బాణాసంచా ప్రత్యేక ఆకర్షణ
- మంగళవారం సాయంత్రం ఏడు గంటల నుంచి వేడుకలు



వరంగల్, అక్టోబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని వరంగల్‌లోని రంగశాయిపేట మహంకాళి దేవాలయ ఆవరణలో నిర్వహించనున్న రావణవధ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తయ్యాయని దసరా ఉత్సవ సమితి అధ్యక్షుడు గుండు పూర్ణచందర్ తెలిపారు. ఆదివారం దేవాలయ ఆవరణలో ఉత్సవ సమితి ప్రతినిధులతో కలిసి కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుండు పూర్ణచందర్ మాట్లాడుతూ.. 1984లో అప్పటి గ్రామ పెద్దలు రావణవధ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, 2003 నుంచి ప్రతి ఏటా గ్రామ పెద్దల సహకారంతో క్రమం తప్పకుండా వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది 36 అడుగుల రావణ ప్రతిమతో పాటు మిరుమిట్లు గొలిపే బాణాసంచా ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. మంగళవారం సాయంత్రం మహంకాళి దేవాలయ ఆవరణలో నిర్వహించే ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, వరంగల్ తూర్పు శాసనసభ్యురాలు కొండా సురేఖ, విశిష్ట అతిథిగా కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ అధ్యక్షురాలు, మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణి, గౌరవ అతిథులుగా వరంగల్ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, శాసనమండలి సభ్యుడు, మాజీ మంత్రి బసవరాజు సారయ్య హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రత్యేక అతిథులుగా న్యాయమూర్తి డాక్టర్ కంచ ప్రసాద్, సీనియర్ పాత్రికేయుడు శంకేసి శంకర్ రావు, మాజీ కార్పొరేటర్లు గుండు చందన పూర్ణచందర్, పోశాల పద్మ స్వామి, కేడల పద్మ జనార్ధన్ పాల్గొంటారని పేర్కొన్నారు. నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మహా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో విద్యుద్దీపాలంకరణ, వేదిక ఏర్పాటు, మైదానాన్ని శుభ్రం చేసే పనులు చేపట్టినట్లు వివరించారు. రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలో భారీ కంచెలు ఏర్పాటు చేస్తున్నామని, అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అగ్నిమాపక వాహనాన్ని కూడా అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. దసరా ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి దామెరకొండ కరుణాకర్ మాట్లాడుతూ.. మంగళవారం సాయంత్రం ఏడు గంటల నుంచి రావణవధ వేడుకలు వైభవంగా ప్రారంభమవుతాయని చెప్పారు. ముందుగా రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం మహంకాళి దేవాలయ ఆవరణకు చేరుకుంటామని తెలిపారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు సంగీత విభావరి ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నగర ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఉత్సవ సమితి ఉపాధ్యక్షుడు పరికిపండ్ల రాజేశ్వర్ రావు, కోశాధికారి కొక్కొండ భాస్కర్, ముఖ్య సలహాదారులు ముత్తినేని రామమూర్తి, మండల లక్ష్మయ్య, జీవీ రామకృష్ణ ప్రసాద్, డాక్టర్ పోతు దర్శనం, చిమ్మని చంద్రమౌళి, కార్యనిర్వాహక కార్యదర్శి బక్కి వంశీ, కార్యదర్శులు బజ్జూరి వీరేశం, పస్తం జిక్షపతి, కత్తెర పల్లి వేణు, కార్యవర్గ సభ్యులు గుండు నవీన్ కుమార్, కన్నెబోయిన కుమార్, ఇట్టబోయిన ప్రదీప్, పాలకుర్తి సుమన్ గౌడ్, శంకేసి అనిల్ కుమార్, మండల హరీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి..

- ఒకే కుటుంబంలో తండ్రి, కుమారుడిని బలిగొన్న విద్యుత్ ప్రమాదం
- జీపీ పల్లిలో విషాదం.. పొలానికి వెళ్తుండగా తెగిపడిన విద్యుత్ వైరు తగిలి దుర్మరణం



చర్ల, అక్టోబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల పరిధిలో విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందాడు. సీకత్తిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని జీపీ పల్లి గ్రామానికి చెందిన పుచ్చా రమణారెడ్డి ఆదివారం ఉదయం తన పంట పొలానికి వెళ్తుండగా, మార్గమధ్యంలో తెగిపడి ఉన్న విద్యుత్ వైరు తగలడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.ఈ ఘటనను గమనించిన స్థానికులు రమణారెడ్డిని వెంటనే చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యుడు సాయివర్ధన్ ధ్రువీకరించారు.ఇదిలా ఉండగా, గతంలో రమణారెడ్డి కుమారుడు కూడా విద్యుత్ షాక్‌తోనే మృతి చెందాడు. ఇప్పుడు తండ్రి కూడా అదే విధంగా ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనతో జీపీ పల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

సద్దుల బతుకమ్మ వేళ పూల మార్కెట్లో సందడి

- ఆకాశాన్నంటిన పూల ధరలు.. ఆచితూచి కొనుగోళ్లు చేస్తున్న మహిళలు



హన్మకొండ, అక్టోబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగ వేళ హన్మకొండ నగరంలో పండుగ సందడి నెలకొంది. నగరంలోని ప్రధాన కూడలైన అంబేద్కర్ సెంటర్ పూల విక్రయాలతో కిటకిటలాడుతోంది. పండుగను ఘనంగా జరుపుకునేందుకు మహిళలు ఉదయం నుంచే మార్కెట్‌కు చేరుకుని రంగురంగుల పూలను కొనుగోలు చేస్తున్నారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే బతుకమ్మ వేడుకల్లో చివరి రోజైన సద్దుల బతుకమ్మను వైభవంగా జరుపుకునేందుకు మహిళలు సిద్ధమవుతున్నారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర పూలతో బతుకమ్మలను అందంగా పేర్చేందుకు అవసరమైన పూలను కొనుగోలు చేస్తున్నారు. దీంతో పూల మార్కెట్‌లో సందడి నెలకొంది.

ప్రత్యేక ఆకర్షణగా సీతజడ పూలు

ఈ ఏడాది పూల మార్కెట్‌లో సీతజడ పూలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. బతుకమ్మ పైభాగాన్ని అందంగా అలంకరించేందుకు ఉపయోగించే ఈ పూలను కొనుగోలు చేసేందుకు మహిళలు ఆసక్తి చూపుతున్నారు. సంప్రదాయ పూలతో పాటు వివిధ రకాల పూలకు గిరాకీ పెరిగింది.

పెరిగిన ధరలతో కొనుగోలుదారులపై భారం

పండుగ నేపథ్యంలో పూలకు డిమాండ్ పెరగడంతో ధరలు కూడా పెరిగాయి. ముఖ్యంగా బంతిపూల ధరలు కిలోకు రూ.100 దాటడంతో కొనుగోలుదారులు ఆచితూచి కొనుగోళ్లు చేస్తున్నారు. పండుగ కోసం తప్పనిసరిగా పూలు కొనాల్సి రావడంతో ధరలు పెరిగినా కొనుగోలు చేయక తప్పడం లేదని పలువురు మహిళలు పేర్కొంటున్నారు. ఒకవైపు పూల మార్కెట్‌లో రద్దీ పెరగగా, మరోవైపు పెరిగిన ధరలు సామాన్యులకు భారంగా మారాయి. అయినప్పటికీ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మను ఆనందోత్సాహాల మధ్య జరుపుకునేందుకు మహిళలు ఉత్సాహం చూపుతున్నారు.

కాళరాత్రి అలంకారంలో పద్మాక్షి అమ్మవారి దివ్యదర్శనం

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు.. భక్తులతో కిటకిటలాడిన ఆలయం

హన్మకొండ, అక్టోబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ నగరంలోని చారిత్రక ఆధ్యాత్మిక క్షేత్రం హనుమద్గిరిపై కొలువుదీరిన శ్రీ పద్మాక్షి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన ఆదివారం అమ్మవారు కాళరాత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దివ్యదర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు.

పంచసూక్తాలు, నారాయణ ఉపనిషత్తుతో అభిషేకాలు

ఆదివారం తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. వేద మంత్రోచ్ఛారణల నడుమ పంచసూక్తాలు, నారాయణ ఉపనిషత్తు పారాయణాలతో అమ్మవారికి మహాభిషేకం నిర్వహించారు. అనంతరం ధూపదీప నైవేద్యాలు సమర్పించి, కాళరాత్రి రూపంలో విశేషంగా అలంకరించారు. అమ్మవారి అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

అర్ధరాత్రి కాళరాత్రి హవనం.. రాత్రంతా జాగరణ

అమ్మవారి అనుగ్రహం కోసం ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు ప్రత్యేక కాళరాత్రి హవనం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన పూజారులు నాగిళ్ల శంకర్ శర్మ, నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని తెలిపారు. అనంతరం రాత్రంతా జాగరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కాళరాత్రి హోమంలో పాల్గొనడం వల్ల భయాలు తొలగి, ఆరోగ్యం, ఐశ్వర్యం సిద్ధిస్తాయని భక్తుల విశ్వాసమని పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ, స్థానిక అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. భక్తుల అమ్మవారి నామస్మరణలతో హనుమద్గిరి పరిసర ప్రాంతాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.



యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించాలి

- విద్య, ఉద్యోగాల సాధన కోసం యువత పోరాడాలి
- ఏటూరునాగారంలో డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

ఏటూరునాగారం, అక్టోబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడల్లో రాణించాలని ఏటూరునాగారం సీఐ సూర్యప్రకాష్ పిలుపునిచ్చారు. విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యమిస్తూ, విద్య, ఉద్యోగాల సాధన కోసం యువత ఐక్యంగా పోరాటం చేయాలని సూచించారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏటూరునాగారం డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీలు స్థానిక కొమరం భీమ్ స్టేడియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను సీఐ సూర్యప్రకాష్ ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, పట్టుదల, ఐక్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. యువత తమలోని ప్రతిభను వెలికితీసేందుకు క్రీడలను మంచి అవకాశంగా మలుచుకోవాలని సూచించారు.డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలై యువత తమ విలువైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. ఇలాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని కోరారు. క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసాన్ని, స్నేహభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జాగటి రవితేజ, జిల్లా కార్యదర్శి టి.ఎల్. రవి, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కర్నె లాజర్, పట్టణ కార్యదర్శి సిద్ధార్థ, జిల్లా ఉపాధ్యక్షుడు కోగిల బాలు, శారీరక విద్య ఉపాధ్యాయుడు ఎంపెల్లి శంకర్, పరికి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు



పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర సహాయ అధ్యక్షుడిగా దాసరి రఘు

- మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నిక..
- 2026–28 కాలానికి బాధ్యతలు



మంథని, అక్టోబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర సహాయ అధ్యక్షుడిగా దాసరి రఘు మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం సూరయ్యపల్లి పాఠశాలలో ఎస్‌జీటీగా విధులు నిర్వహిస్తున్న ఆయన ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అందిస్తున్న సేవలను గుర్తించి సంఘం ప్రతినిధులు ఈ పదవికి ఎంపిక చేశారు. నల్గొండలోని జీఎం గార్డెన్స్‌లో నిర్వహించిన పీఆర్‌టీయూ టీఎస్ ఆరో కౌన్సిల్ సమావేశంలో 2026–28 కాలానికి నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో దాసరి రఘును రాష్ట్ర సహాయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు సుంకరి భిక్షం గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భట్టాపురం మధుసూదన్ రెడ్డి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు గండు కృష్ణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి కానుగంటి శ్రీనివాస్, మంథని మండల అధ్యక్షుడు గాదర్ల కొమురయ్య గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి ఎగ్గిడి సురేష్‌లకు దాసరి రఘు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, సంఘ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

గొల్లపల్లిలో అంగరంగ వైభవంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

- సర్పంచ్ కన్నబోయిన సంధ్య స్వామి ఆధ్వర్యంలో సంబరాలు.. విద్యుత్ దీపాల వెలుగుల్లో పండుగ సందడి



సంగెం, అక్టోబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): సంగెం మండలం గొల్లపల్లి గ్రామంలో సద్దుల బతుకమ్మ ఉత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. గ్రామ సర్పంచ్ కన్నబోయిన సంధ్య స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలతో గ్రామమంతా పండుగ శోభను సంతరించుకుంది. గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల వెలుగుల్లో బతుకమ్మ వేడుకలు కనులపండువగా సాగాయి. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి వేడుకలకు తరలివచ్చారు. బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ, ఆటపాటలతో ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. బతుకమ్మ పాటలతో గ్రామం మారుమోగగా, మహిళల కోలాహలం పండుగ వాతావరణాన్ని మరింత సందడిగా మార్చింది. గ్రామ ప్రజలు, యువత ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొని పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను గ్రామస్థులు సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు.

తెలంగాణ ప్రజలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి సీతక్క

- ప్రతి ఆడపడుచు జీవితంలో ఆనందాల పూలు విరియాలి
- ప్రతి ఇంటా సుఖసంతోషాలు, సిరిసంపదలు వెల్లివిరియాలి



నిత్యం నిఘా ప్రతినిధి: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతిని పూజిస్తూ, రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆడపడుచుల ఆత్మీయతను చాటిచెప్పే ఈ పండుగ ప్రతి ఇంటా ఆనందాల వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. తెలంగాణ ఆడపడుచుల జీవితాల్లో సంతోషాలు విరబూయాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో తులతూగాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు మంత్రి సీతక్క పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ బతుకమ్మ పండుగను ఐక్యత, సోదరభావం, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజల ప్రతి ఇంటా బతుకమ్మ పూల పరిమళాలు విరజిమ్మాలని, ప్రతి మనసులో సంతోషం నిండాలని, అందరి జీవితాల్లో సుఖశాంతులు, సిరిసంపదలు వెల్లివిరియాలని మంత్రి సీతక్క మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

అన్నారం షరీఫ్‌లో వైభవంగా బతుకమ్మ సంబరాలు

- పూల శోభతో కళకళలాడిన గ్రామం.. పాటలు, కోలాటాలతో మహిళల సందడి



పర్వతగిరి, అక్టోబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాలు వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ గ్రామంలో వైభవంగా కొనసాగుతున్నాయి. తొమ్మిది రోజుల పాటు సాగే పూల పండుగను గ్రామ మహిళలు, యువతులు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటున్నారు. ప్రతిరోజూ సాయంత్రం మహిళలు తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి గౌరమ్మను పూజిస్తున్నారు. గ్రామ వీధుల్లో బతుకమ్మ పాటలు, కోలాటాలు, సంప్రదాయ నృత్యాలతో పండుగ వాతావరణం నెలకొంది. 'ఉయ్యాలో.. ఉయ్యాలో..' అంటూ మహిళలు ఆలపించే పాటలు గ్రామమంతటా మార్మోగుతున్నాయి. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ ఉత్సాహంగా పాల్గొంటూ బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆటపాటలతో సందడి చేస్తున్నారు. అనంతరం గ్రామ పెద్దలు, యువకుల సహకారంతో బతుకమ్మలను మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా సమీపంలోని జలవనరుల వద్దకు తీసుకెళ్లి సంప్రదాయబద్ధంగా నిమజ్జనం చేస్తున్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్న ఈ వేడుకలు గ్రామ ఐక్యతను, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెబుతున్నాయి. బతుకమ్మ సంబరాలతో అన్నారం షరీఫ్ గ్రామం పూల శోభతో కళకళలాడుతోంది.

హన్మకొండలో ప్రభుత్వ వైద్యుడు అదృశ్యం

- హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి సివిల్ సర్జన్ పున్నం రమేష్‌బాబు ఆచూకీ కోసం గాలింపు
- భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన హసన్‌పర్తి పోలీసులు



హన్మకొండ, అక్టోబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): హన్మకొండ జిల్లా హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రభుత్వ వైద్యుడు అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో సివిల్ సర్జన్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ పున్నం రమేష్‌బాబు ఈ నెల 17వ తేదీ మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఆయన కోసం బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. రమేష్‌బాబు ఉపయోగించే రెండు సెల్‌ఫోన్లు కూడా స్విచ్‌ఆఫ్‌లో ఉండటంతో ఆయన భార్య హసన్‌పర్తి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు అదృశ్యమైన వ్యక్తిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వండి

డాక్టర్ పున్నం రమేష్‌బాబు ఆచూకీ కోసం పోలీసులు వివిధ కోణాల్లో గాలిస్తున్నారు. ఆయన ఇంటి నుంచి వెళ్లిన సమయంలో నీలం రంగు చొక్కా, జీన్స్ ధరించి ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఆయన ఎక్కడైనా కనిపించినా, ఆచూకీకి సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే హసన్‌పర్తి పోలీసులకు తెలియజేయాలని దర్యాప్తు అధికారి, ఇన్‌స్పెక్టర్ మహేందర్ ప్రజలను కోరారు..

బెస్తం చెరువు శివారులో బతుకమ్మ సంబరాలు

- మహంకాళి వీధి ఆడపడుచుల ఆటపాటలతో పూల పండుగ సందడి



వరంగల్, అక్టోబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 42వ డివిజన్ రంగశాయిపేట బెస్తం చెరువు శివారులో మహంకాళి వీధి ఆడపడుచులు సద్దుల బతుకమ్మ సంబరాలను ఉత్సాహంగా జరుపుకున్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబై బతుకమ్మ చుట్టూ చేరి ఆటపాటలతో సందడి చేశారు. తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ మహిళలు వలయంగా నిలిచి, బతుకమ్మ పాటలు పాడుతూ ఆనందోత్సాహాల మధ్య వేడుకల్లో పాల్గొన్నారు. పూల పరిమళాలు, పాటల మాధుర్యంతో బెస్తం చెరువు పరిసరాలు పండుగ శోభను సంతరించుకున్నాయి. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ పుట్టింటి మమకారాన్ని, మెట్టింటి అనురాగాన్ని, ఆడపడుచుల ఐక్యతను చాటిచెబుతుందని మహిళలు పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయాన్ని కాపాడుకుంటూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఆడబిడ్డ జీవితం బతుకమ్మలా అందంగా విరియాలని, రైతుల ఇళ్లలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని గౌరమ్మ తల్లిని ప్రార్థించారు. తెలంగాణ ప్రజలను చల్లగా చూడాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు. పూలలో పరిమళం, పాటల్లో మాధుర్యం, ఆడబిడ్డల చిరునవ్వుల్లో తెలంగాణ వైభవం నిండిన బతుకమ్మ సంబరాలు మహిళల్లో ఆనందాన్ని నింపాయి

ప్రశాంత వాతావరణంలో దుర్గాదేవి నిమజ్జన వేడుకలు నిర్వహించాలి

- ఊరేగింపుల్లో భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలి



సుల్తానాబాద్, అక్టోబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి) దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన వేడుకలను ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ సూచించారు. శనివారం సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఉత్సవ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేడుకల సమయంలో భద్రతా నియమాలు పాటిస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. దుర్గాదేవి విగ్రహాల ఊరేగింపుల సమయంలో చిన్నారులను ట్రాక్టర్లపై కూర్చోబెట్టవద్దని సూచించారు. రహదారులపై విద్యుత్ తీగలు, గుంతలు, వేగ నిరోధకాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఊరేగింపులు, నిమజ్జన కార్యక్రమాల్లో నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నిమజ్జనం సందర్భంగా చిన్నారులను చెరువుల్లోకి దిగనివ్వకూడదని, నీటి వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిర్ణీత సమయం లోపు నిమజ్జన కార్యక్రమాలను జాగ్రత్తగా పూర్తి చేయాలని తెలిపారు. పోలీసుల సూచనలు, నిబంధనలను పాటిస్తూ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించుకోవాలని ఏసీపీ కోరారు. ఈ సమావేశంలో సీఐ రంజిత్ రావు, ఎస్సై చంద్రకుమార్, అదనపు ఎస్సై అశోక్ రెడ్డి, పోలీసు సిబ్బంది, దుర్గాదేవి ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక

- మడికొండ ప్రజలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన సీపీఐ నాయకులు



మడికొండ, అక్టోబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ అన్నారు. పూలతో బతుకమ్మను పేర్చి ఆడపడుచులందరూ భక్తిశ్రద్ధలతో పూజిస్తూ, ఆటపాటలతో జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ప్రత్యేకతను ప్రపంచానికి చాటిచెబుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మడికొండ గ్రామ ప్రజలందరికీ ఆయన బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే బతుకమ్మ వేడుకలను ప్రజలంతా ఐకమత్యంతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కాజీపేట మండల కార్యదర్శి మాలోత్ శంకర్ నాయక్ పాల్గొని గ్రామ ప్రజలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

పేదలకు వైద్య భరోసా..

మహిళలకు స్వయం ఉపాధి ప్రోత్సాహం

- **సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ.. కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసిన మహిళలకు ధ్రువపత్రాలు**



మంథని, అక్టోబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్స పొందలేని పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు అత్యవసర వైద్య ఖర్చుల విషయంలో ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోందని పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం మంథని పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు మంత్రి పంపిణీ చేశారు. వైద్య ఖర్చులను భరించలేని పేద కుటుంబాలకు ఈ ఆర్థిక సాయం ఎంతో ఊరటనిస్తుందని తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.

మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడాలి

ఇదే కార్యక్రమంలో కుట్టు మిషన్ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన మంథని పట్టణ క్రమాలు మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మంథని నియోజకవర్గానికి చెందిన ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులు, కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసిన మహిళలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు

ఆత్మరక్షణకు ప్రాచీన యుద్ధకళలు ఎంతో అవసరం

- **200 మంది క్రీడాకారులకు టీషర్టుల పంపిణీ**
- **జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆసంపల్లి శ్రీనివాస్**



గోదావరిఖని, అక్టోబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడంతోపాటు ఆత్మరక్షణకు ప్రాచీన యుద్ధకళలు ఎంతో ఉపయోగపడతాయని పెద్దపల్లి జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆసంపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం గోదావరిఖని పట్టణంలోని జై భారత్ హనుమాన్ అకాడమీకి చెందిన 200 మంది క్రీడాకారులకు ఆయన ఆధ్వర్యంలో టీషర్టులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. నేటి పరిస్థితుల్లో బాలబాలికలందరూ ప్రాచీన యుద్ధకళల్లో శిక్షణ పొందాలని సూచించారు. ఈ కళలు శారీరక దృఢత్వంతోపాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఆత్మరక్షణ సామర్థ్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. యుద్ధకళల్లో శిక్షణ పొందే క్రీడాకారులకు తనవంతు సహకారం అందిస్తానని వెల్లడించారు. ప్రతి పాఠశాలలో ప్రాచీన యుద్ధకళలను ప్రోత్సహించి, విద్యార్థులకు శిక్షణ అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ శిక్షణ కార్యక్రమాలకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సహకారం ఉంటుందని పేర్కొన్నారు. గత నాలుగు దశాబ్దాలుగా జై భారత్ హనుమాన్ అకాడమీ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక యుద్ధకళల ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా యుద్ధకళల్లో శిక్షణ అందిస్తున్న అకాడమీ మాస్టర్ మచ్చ శంకర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మచ్చ విశ్వాస్, నాతరి ఆదిత్య, పల్లె ప్రశాంత్, నంబయ్యతో పాటు పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

దుర్గామాతను దర్శించుకున్న బీజేపీ నేత చంద్రుపట్ల సునీల్ రెడ్డి

- **నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు.. శాలువాతో సన్మానం**



కమాన్‌పూర్, అక్టోబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి) : పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ యువసేన అధ్యక్షుడు మల్యాల శేఖర్, సభ్యులు సునీల్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. దుర్గామాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని సునీల్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు మచ్చగిరి రాము, జంగపల్లి అజయ్, బర్ల సది, మల్లారపు అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాల సోయగం.. కోలాటాల కోలాహలం!

- **మల్లంపల్లిలో అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబరాలు**
- **సంప్రదాయ అలంకరణల్లో మహిళల సందడి.. పూల బతుకమ్మల చుట్టూ ఆటపాటలతో ఉత్సాహం**



మల్లంపల్లి, అక్టోబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగ ములుగు జిల్లా మల్లంపల్లి మండల కేంద్రంలో అంగరంగ వైభవంగా జరిగింది. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు, సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబైన మహిళలు, కోలాటాల కోలాహలం, పాటలు, నృత్యాలతో మల్లంపల్లి అంగడి ప్రాంతం పండుగ శోభను సంతరించుకుంది. చిన్నా పెద్దా తేడా లేకుండా గ్రామ ప్రజలంతా ఉత్సాహంగా పాల్గొనడంతో వేడుకల ప్రాంగణమంతా ఆనందోత్సాహాలతో మార్మోగింది.

సంప్రదాయ అలంకరణల్లో ఆడపడుచుల సందడి

సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తులు, అందమైన ఆభరణాలతో ముస్తాబై వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వివిధ రకాల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను తీసుకొచ్చి వాటి చుట్టూ చేరి పాటలు పాడుతూ సంబరాలు చేసుకున్నారు. మహిళల సంప్రదాయ అలంకరణలు, బతుకమ్మల రంగుల అందాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

కోలాటాలు.. పాటలు.. నృత్యాలతో కోలాహలం

బతుకమ్మల చుట్టూ మహిళలు, యువతులు గుమిగూడి కోలాటాలు ఆడుతూ, చప్పట్లు కొడుతూ ఉత్సాహంగా నృత్యాలు చేశారు. సంప్రదాయ బతుకమ్మ పాటలతో పాటు డీజే పాటలకు అనుగుణంగా అడుగులు వేస్తూ సందడి చేశారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ వేడుకల్లో భాగస్వాములై ఆనందాన్ని పంచుకున్నారు. ఒకవైపు కోలాటాలు, మరోవైపు ఆటపాటలతో అంగడి ప్రాంతమంతా పండుగ కళతో ఉట్టిపడింది.

విద్యుత్ దీపాల వెలుగుల్లో పండుగ శోభ



మల్లంపల్లి సర్పంచ్ ల్యాద శ్యామ్ రావు ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ వేడుకలకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. అంగడి ప్రాంతాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించడంతో రాత్రివేళ మరింత శోభాయమానంగా కనిపించింది. ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయడంతో గ్రామస్థులు ఉత్సాహంగా పండుగను జరుపుకున్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ

బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఆత్మ గౌరవానికి, ప్రకృతిపై ప్రేమకు, రాష్ట్ర సాంస్కృతిక అస్తిత్వానికి ప్రతీకగా నిలుస్తోంది. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను కొనసాగిస్తూ కొత్త తరం కూడా ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొనడం విశేషం. మల్లంపల్లిలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ సంబరాలు గ్రామ ప్రజల మధ్య ఆత్మీయతను పెంపొందించడంతో పాటు, మధుర జ్ఞాపకాలను మిగిల్చాయి.

ములుగు జిల్లాలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

- **గ్రామగ్రామాన పూల పండుగ సందడి.. ఆటపాటలతో మహిళల కోలాహలం**
- **సంప్రదాయబద్ధంగా బతుకమ్మ వేడుకలు.. పోలీసుల బందోబస్తు**



ములుగు, అక్టోబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగను ములుగు జిల్లా వ్యాప్తంగా మహిళలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. జిల్లా పరిధిలోని గ్రామాలన్నీ పూల శోభతో కళకళలాడగా, మహిళలు, యువతులు సంప్రదాయ దుస్తులు ధరించి ఆటపాటలతో సందడి చేశారు. ముఖ్యంగా వెంకటాపూర్ మండల కేంద్రంలో మహిళలు పెద్ద సంఖ్యలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. తెల్లవారు జామునే నిద్రలేచి ఇంటి పనులు పూర్తి చేసుకున్న మహిళలు స్నానాలు ఆచరించి, తంగేడు, గునుగు, గుమ్మడి, బంతి, చామంతి తదితర రకరకాల పూలను సేకరించారు. రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి గౌరమ్మను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొబ్బరికాయలు కొట్టి తమ కోరికలు నెరవేర్చాలని అమ్మవారిని ప్రార్థించారు. ప్రకృతిని ఆరాధిస్తూ పూలను పూజించే విశిష్ట సంప్రదాయమే బతుకమ్మ పండుగ ప్రత్యేకత. మహిళలంతా ఒకచోట చేరి బతుకమ్మలను వరుసగా ఏర్పాటు చేసి వాటి చుట్టూ తిరుగుతూ చప్పట్లు కొడుతూ గౌరమ్మ, బతుకమ్మ పాటలను ఆలపించారు. పిల్లాపాపలతో కలిసి ఆటపాటల్లో మునిగిపోయారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా బతుకమ్మ పాటలు, మహిళల సందడితో పండుగ వాతావరణం నెలకొంది.

మహిళల ఆనందోత్సాహాలు

బొడ్డెమ్మ వేడుకలతో ప్రారంభమైన పండుగ అనంతరం తొమ్మిది రోజులపాటు బతుకమ్మ సంబరాలు కొనసాగి సద్దుల బతుకమ్మతో ముగిశాయి. ఏడాదికి ఒకసారి వచ్చే ఈ పూల పండుగ కోసం ఎంతోకాలంగా ఎదురుచూసిన మహిళలు వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సంప్రదాయాల పరిరక్షణతో పాటు మహిళల ఐక్యతను చాటిచెప్పేలా సద్దుల బతుకమ్మ వేడుకలు వైభవంగా ముగిశాయి.

నార్లవాయిలో అంగరంగ వైభవంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

- **సర్పంచ్ సింగిరెడ్డి అనిల్ రాజు ఆధ్వర్యంలో వేడుకలు**
- **బతుకమ్మ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం**



సంగెం, అక్టోబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ జిల్లా సంగెం మండలం నార్లవాయి గ్రామంలో సద్దుల బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. గ్రామ సర్పంచ్ సింగిరెడ్డి అనిల్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో మహిళలు, ఆడపడుచులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆటపాటలు, సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలతో గ్రామంలో పండుగ శోభ సంతరించుకుంది. ఈ సందర్భంగా సర్పంచ్ సింగిరెడ్డి అనిల్ రాజు మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ నిలువుటద్దమని అన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ పూలను దేవతగా పూజించే గొప్ప సంప్రదాయం బతుకమ్మ పండుగలో ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర ప్రకృతి సిద్ధమైన రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ప్రకృతికి కృతజ్ఞతలు తెలిపే విశిష్టమైన పండుగ ఇదని వివరించారు. బతుకమ్మ పండుగ ఆడబిడ్డల ఐక్యతకు, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని, ఇలాంటి పండుగలతో గ్రామాల్లో మహిళల మధ్య అనుబంధాలు మరింత బలపడతాయని ఆయన అన్నారు. అనంతరం నిర్వహించిన బతుకమ్మ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిని గొట్కుల రజిత, రెండో బహుమతిని సింగిరెడ్డి రమ, మూడో బహుమతిని దామర రజిత అందుకున్నారు. ఈ వేడుకల్లో గ్రామ మహిళలు, ఆడపడుచులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ పాటలు పాడుతూ, సంప్రదాయ ఆటపాటలు, నృత్యాలతో సందడి చేశారు. గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది.

అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబరాలు!

- పాలకుర్తిలో ఆడపడుచుల ఆటపాటలతో పూల పండుగ కోలాహలం
- తొమ్మిది రోజుల వేడుకలకు ఘనంగా ముగింపు.. పాల్గొన్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



జనగామ జిల్లా / పాలకుర్తి, అక్టోబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి):తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ సంబరాలు పాలకుర్తి మండల కేంద్రంలో అంబరాన్నంటాయి. ఎటుచూసినా రంగురంగుల పూల బతుకమ్మలు, మరోవైపు ఆడపడుచుల ఆటపాటలు, సంప్రదాయ నృత్యాలతో పండుగ వాతావరణం నెలకొంది. తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో కొనసాగిన బతుకమ్మ వేడుకలకు సద్దుల బతుకమ్మతో ఘనంగా ముగింపు పలికారు. ఈ వేడుకల్లో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పాల్గొని మహిళలతో కలిసి సందడి చేశారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర రకరకాల పూలతో మహిళలు, యువతులు అందంగా బతుకమ్మలను పేర్చారు. సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబై కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. బతుకమ్మల చుట్టూ వలయంగా తిరుగుతూ సంప్రదాయ పాటలు ఆలపిస్తూ ఆటపాటలతో సందడి చేశారు. మహిళల కోలాహలంతో పాలకుర్తి మండల కేంద్రం పూల శోభను సంతరించుకుంది.

అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు

సద్దుల బతుకమ్మ వేడుకలు ఎలాంటి అవాంతరాలు లేకుండా సజావుగా సాగేందుకు సర్పంచ్, ఉపసర్పంచ్, గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. నిరంతర విద్యుత్ సరఫరాకు విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోగా, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది కీలక పాత్ర పోషించారు. దీంతో వేడుకలు ప్రశాంత వాతావరణంలో కొనసాగాయి.

వచ్చే ఏడాది మళ్లీ రావమ్మా..

పండుగ ముగింపు సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో బతుకమ్మలను నిమజ్జనానికి తీసుకెళ్లారు. సంప్రదాయ పాటలు పాడుతూ, ఆటపాటలతో పూల పండుగకు వీడ్కోలు పలికారు. “పోయిరా బతుకమ్మ.. మళ్లీ మళ్లీ రావమ్మా” అంటూ బతుకమ్మను సాగనంపుతూ వచ్చే ఏడాది కూడా తమ జీవితాల్లో సుఖ సంతోషాలు నింపాలని గౌరమ్మను ప్రార్థించారు. పాలకుర్తిలో సద్దుల బతుకమ్మ సంబరాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పాయి.

వర్ధన్నపేటలో బతుకమ్మ సంబరాల్లో నిత్యం నిఘా ఆడబిడ్డలు



వర్ధన్నపేట, అక్టోబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకల్లో నిత్యం నిఘా తెలుగు దినపత్రిక ఆడబిడ్డలు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు.

తెలంగాణ సంస్కృతి వైభవానికి ప్రతీక సద్దుల బతుకమ్మ

- సంగెం మండల ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎంపీపీ కందకట్ల కళావతి నరహరి



సంగెం, అక్టోబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి):తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవానికి ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగను ప్రజలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని మాజీ ఎంపీపీ కందకట్ల కళావతి నరహరి ఆకాంక్షించారు. సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని సంగెం మండల ప్రజలకు, మహిళలకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కళావతి నరహరి మాట్లాడుతూ, ప్రకృతిని ఆరాధిస్తూ, రంగురంగుల పూలను పూజిస్తూ మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకునే బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతిలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందన్నారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను కాపాడుకుంటూ



పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. సద్దుల బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా సంతోషాలు నింపాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు వెల్లివిరియాలని ఆమె ఆకాంక్షించారు.

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపునకు ప్రత్యేక వెబ్‌సైట్

- జీవో జారీకి కృషి చేసిన మంత్రి శ్రీధర్ బాబుకు ఉద్యమకారుల సంఘం కృతజ్ఞతలు



మంథని, అక్టోబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి):తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులకు గుర్తింపు కల్పించేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే ప్రత్యేక వెబ్‌సైట్ ప్రారంభానికి సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయ్యేలా కృషి చేసిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు తెలంగాణ ఉద్యమకారుల సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులను గుర్తించి వారికి తగిన గుర్తింపు కల్పించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుల విధానం అందుబాటులోకి రావడం ద్వారా గుర్తింపు ప్రక్రియ సులభతరమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ కావేటి సతీష్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంథని మండల అధ్యక్షుడు మిర్యాల రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సాదుల శ్రీనివాస్, జిమ్మడ కొండయ్య, కోరవేణ కుమార్, ఆరెల్లి సురేందర్, ఆర్తి శివ, దాడి శ్రీనివాస్ తదితర ఉద్యమ నాయకులు పాల్గొన్నారు.

తిమ్మాపురంలో ఘనంగా బతుకమ్మ విగ్రహ ఆవిష్కరణ

- సర్పంచ్ సేవాభావం అభినందనీయం: ఎస్సై వంశీకృష్ణ



సంగెం, అక్టోబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): సంగెం మండలం తిమ్మాపురం గ్రామంలో బతుకమ్మ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. గ్రామ సర్పంచ్ వేల్పుల రాజు, సునీత దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్థానిక ఎస్సై వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. సర్పంచ్ వేల్పుల రాజు తన తండ్రి దివంగత వేల్పుల ఐలయ్య, కుమారుడు బన్నీ జ్ఞాపకార్థం గ్రామానికి బతుకమ్మ విగ్రహాన్ని విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై వంశీకృష్ణ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ విగ్రహాన్ని గ్రామానికి అందించడం అభినందనీయమన్నారు. కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయమని, సర్పంచ్ సేవాభావం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు. విగ్రహ ఆవిష్కరణ అనంతరం గ్రామ ప్రజలు, మహిళలు నూతన విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొలకనూరి స్వామి, మాజీ ఎంపీపీ మల్లయ్య, మాజీ సహకార సంఘం అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి, మాజీ సర్పంచ్ మాదినేని రామిరెడ్డి, వార్డు సభ్యులు మెంతుల శ్రీనివాసు, కొలకనూరి దివ్య, రాజు, పోశాల రాజేష్, స్రవంతి, కొలకనూరి రాజు, ఉడుత అనిల్ యాదవ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు, స్థానిక నాయకులు గన్ను రమేష్, బండారి అశోక్, అడ్డగట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న ఇనగాల

- ఆత్మకూరు, తిరుమలగిరి, హౌస్ బుజుర్గులో పర్యటన
- తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ పండుగ ప్రతీక: ఇనగాల వెంకట్రామ్ రెడ్డి







హనుమకొండ, అక్టోబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి జిల్లాలోని పలు గ్రామాల్లో పర్యటించి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్న పూల పండుగలో భాగస్వాములై వారికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పర్యటనలో భాగంగా తొలుత ఆత్మకూరు గ్రామంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు హాజరైన ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, అనంతరం తిరుమలగిరి గ్రామంలో జరిగిన సంబరాల్లో పాల్గొన్నారు. చివరిగా హౌస్ బుజుర్గు గ్రామానికి చేరుకుని మహిళలు రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలతో ఆడిపాడుతున్న వేడుకలను తిలకించారు. ఆయా గ్రామాలకు చేరుకున్న ఆయనకు స్థానిక సర్పంచులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ పండుగ ప్రజల జీవితాల్లో ఆనందాన్ని నింపాలని, కుటుంబాలన్నీ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ పర్యటనలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ఆయా గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

దుర్గాష్టమి వేళ దుర్గాదేవిగా భద్రకాళి అమ్మవారి దర్శనం

- ఎనిమిదో రోజు ప్రత్యేక పూజలు.. భద్రపీఠ, అశ్వవాహన సేవలు
- భద్రకాళి ఆలయంలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు..
- బతుకమ్మలతో సందడి చేసిన వేలాది మంది మహిళలు





వరంగల్, అక్టోబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ శ్రీ భద్రకాళి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. ఆదివారం దుర్గాష్టమి సందర్భంగా అమ్మ వారిని దుర్గాదేవిగా అలంకరించి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వ హించారు. తెల్లవారుజామున 4 గంటలకు నిత్యాహ్నికం అనంతరం పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఉదయం భద్రపీఠ సేవ, సాయంత్రం అశ్వవాహన సేవలను వైభవంగా నిర్వ హించారు.

దుర్గాష్టమి ప్రత్యేకత.. భద్రకాళి అవతరణ

దుర్గాష్టమి రోజున భద్రకాళి అమ్మవారు కోటి యోగినీ గణాలతో అవతరించారని దేవీ భాగవతంలోని ప్రస్తావన ఆధారంగా ఆలయ సంప్రదాయంలో ఈ రోజుకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని దేవస్థాన వర్గాలు వివరించాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో బతుకమ్మ పండుగకు భద్రకాళి ఆరాధనతో అనుబంధం ఉందని పేర్కొన్నాయి. దుర్గాష్టమి సందర్భంగా మహిళలు అమ్మవారికి సద్దులు సమర్పించి బతుకమ్మ ఆడటం ఆనవాయితీగా వస్తోందని తెలిపాయి. తెల్లవారుజామున ప్రారంభమైన పూజా కార్యక్రమాల అనంతరం రాత్రి కూడా అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు, జపహోమాది క్రతువులు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రజాప్రతినిధులు

దుర్గాష్టమి సందర్భంగా శాసనమండలి సభ్యుడు శ్రీ బస్వరాజు సారయ్య ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట ప్రముఖ వ్యాపారవేత్త, దేవస్థాన ఉభయదాత అప్పావారి లక్ష్మీనారాయణ ఉన్నారు. అనంతరం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయభాస్కర్, మాజీ శాసనసభ్యుడు నన్నపునేని నరేందర్ తదితరులు ఉన్నారు. ఆలయానికి విచ్చేసిన ప్రముఖులకు ధర్మకర్తలు కమటం వేణుగో పాల్, రమేష్ చంద్ భంగ్, కార్యనిర్వహణాధికారి రామల సునీత, అర్చకులు ఘనస్వాగతం పలికారు. దర్శనం, పూజల అనంతరం మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదా లను అందజేశారు.

బతుకమ్మలతో సందడిగా ఆలయ ప్రాంగణం

దుర్గాష్టమి సందర్భంగా సాయంత్రం ఆలయ ప్రాంగణంలో వేలాది మంది మహిళలు బతుకమ్మలతో సందడి చేశారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ చేరి ఆటపాటలతో పండుగను జరుపుకున్నారు. ఆలయ ప్రాంగణమంతా భక్తుల రాకతో పండుగ శోభను సంతరించుకుంది. ఈ రోజు ఉత్సవాలకు భారతీ డిగ్రీ కళాశాల అధినేతలు ఇరుకుళ్ల సంజయ్ కుమార్, జయశ్రీ దంపతులు, డాక్టర్ పోతాని రాజేశ్వరప్రసాద్, డాక్టర్ లలితాదేవి దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు.— రామల సునీత, కార్యనిర్వహణాధికారి, శ్రీ భద్రకాళి దేవస్థానం

సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి ఎర్రబెల్లి

- కేసీఆర్ హయాంలో ఆడబిడ్డలకు బతుకమ్మ చీరల పంపిణీ
- ప్రస్తుత ప్రభుత్వంలో పండుగ వేళ కరెంటు కష్టాలు : ఎర్రబెల్లి



నిత్యం నిఘా బ్యూరో : తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ పండుగ నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రకృతిలో లభించే రకరకాల పూలను సేకరించి, అందంగా పేర్చి, పార్వతీదేవి ప్రతిరూపమైన గౌరమ్మను ప్రతిష్ఠించి పూజించడం ఈ పండుగ ప్రత్యేకత అని తెలిపారు.ప్ర పంచంలోనే ఆడబిడ్డలు పూలను పూజించే విశిష్టమైన సంస్కృతి తెలంగాణలో ఉందని, బతుకమ్మ పండుగ మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని ఎర్రబెల్లి అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆడబిడ్డ లకు బతుకమ్మ చీరలను పండుగ కానుకగా అందించారని గుర్తుచేశారు. బతుకమ్మ పండుగను రాష్ట్ర పండుగగా ప్రకటించింది కూడా కేసీఆర్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు.ప్ర స్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో బతుకమ్మ వేడుకలు జరుపుకునే సమయంలో కూడా సరిగా విద్యుత్ సరఫరా చేయడం లేదని ఎర్రబెల్లి విమర్శించారు. తెలంగాణ ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు. బంధుమిత్రులతో కలిసి సద్దుల బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ మరోసారి సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

సద్దుల బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న ఎర్రబెల్లి ప్రదీప్ రావు

- తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతి ఆరాధనకు ప్రతీక బతుకమ్మ



వరంగల్, అక్టోబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ తూర్పు నియోజకవ ర్గంలోని జెమినీ టాకీస్ ప్రాంతంలో సంస్కార భారతి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ సంబరాల్లో బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కో-ఆపరే టివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు పాల్గొన్నారు. మహిళలతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రదీప్ రావు మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతి ఆరాధనకు, సామాజిక ఐక్యతకు బతుకమ్మ పండుగ నిదర్శనమని అన్నారు. తరతరాలుగా వస్తున్న తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరా లకు అందించడంలో ఇలాంటి వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. మహిళలందరూ సద్దుల బతుకమ్మ పండుగను సంతోషంగా, సంప్రదాయబ ద్ధంగా జరుపుకోవాలని ఆకాంక్షిం చారు.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ బత్తుల మోహన్, బీజేపీ సీనియర్ నాయకులు రత్నం సతీష్ షా, కూచన క్రాంతి, సీత నాగరాజు, సుమన్ కత్రి, జెట్టీ శివప్రసాద్, సంస్కార భారతి ప్రతినిధులు, మహిళలు, స్థానిక నాయకులు తదిత రులు పాల్గొన్నారు.

దుర్గామాత నవరాత్రులు సందర్భంగా అన్నదాన కార్యక్రమం విజయవంతం

- శివాలయం సెంటర్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన సర్పంచ్ బానోతు జ్యోతి కొండ



నిత్యం నిఘా, బోనకల్, అక్టోబర్ 18, : దుర్గామాత నవరాత్రి ఉత్సవాలను పుర స్కరించుకుని బోనకల్ గ్రామంలోని శివాలయం సెంటర్‌లో అన్నదాన కార్య క్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వ హించారు. ఈ సందర్భంగా బోనకల్ గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ, ఒకటవ వార్డు మెంబర్ యార్లగడ్డ కుమారి అన్నదాన కార్యక్ర మాన్ని ప్రారంభించారు. అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తులకు అన్నప్రసాదం అందించడం అభినందనీ యమని, అన్నదానం మహోన్నతమైన సేవా కార్యక్రమమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. న వ రాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వ హించిన ఈ అన్నదాన కార్యక్రమంలో భక్తులు, స్థానికులు పాల్గొని అన్నప్ర సాదాన్ని స్వీకరించారు. భక్తి, సేవాభావం, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచే అన్నదాన కార్యక్రమం భక్తుల్లో ఆనందాన్ని నింపింది.ఈ అన్నదాన కార్యక్రమానికి నందిగామ వాస్తవ్యులు పసుమర్తి వెంకటేశ్వరరావు, మధిర వాస్తవ్యులు కాటేపల్లి నాగరాజు తమవంతు సహకారం అందించారు. ఉత్సవాల సందర్భంగా అన్నదాన కార్యక్రమానికి సహకరించిన దాతలను పలువురు అభినందించారు. దైవభక్తితో పాటు సేవాభావాన్ని చాటుతూ ఇలాంటి కార్యక్ర మాలు నిర్వహించడం సమాజంలో సోదరభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తుందని స్థానికులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో.. శివాలయం చైర్మన్ యార్లగడ్డ శ్రీను, యార్లగడ్డ రమేష్, గుగులోతు నాగేశ్వరరావు, తెల్లాకుల రజిని, నాగేశ్వరరావు, త్రివేణి ,లక్ష్మి , సుశీల, రేణుక , జి లక్ష్మి, జ్యోతి ,నాగమణి అరుణ,మంజుల ,మంద లక్ష్మి , నారా యణమ్మ మరియు దుర్గామాత కమిటీ సభ్యులు స్థానికులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

బతుకమ్మ, దసరా పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

- రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలి.. సీఐ శ్రీను



ఎల్కతుర్తి, అక్టోబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి):బతుకమ్మ, దసరా పండుగలను ప్రజ లందరూ ఆనందోత్సాహాలతో, ప్రశాంత వాతా వరణంలో జరుపుకోవాలని ఎల్కతుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీను కోరారు. పండుగలను పుర స్కరించుకుని మహిళలకు, ప్రజలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. సద్దుల బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో అమ్మవారి మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు భద్రతా నియమా లను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనాలపై ముగ్గురు ప్రయాణించరాదని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని స్పష్టం చేశారు. వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని కోరారు. పండుగల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘ టనలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీ సులకు సహకరించాలని సీఐ శ్రీను విజ్ఞప్తి చేశారు. మహిళలు, యువతులు పండుగ వేడుకల్లో పాల్గొనే సమయంలో బంగారు ఆభ రణాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్‌తో పాటు సర్కిల్ పరిధిలోని వంగర, భీమదేవర పల్లి పోలీస్ స్టేషన్ల పరిధి ప్రజలందరూ పోలీసుల సూచనలు పాటిస్తూ పండుగలను సురక్షితంగా జరుపుకోవాలని కోరారు. బొడ్డెమ్మ, బతుకమ్మ, దసరా పండుగలను బాధ్యతాయుతంగా, సంతోషంగా జరుపుకో వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

దుర్గామాతకు భక్తిశ్రద్ధలతో పూజలు
భక్తులకు అన్నప్రసాద వితరణ





నిత్యం నిఘా, షాబాద్, అక్టోబర్ 18 : మండల కేంద్రంలో కొలువుదీరిన దుర్గామాత భక్తులకు మహా చండి రూపంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి నామస్మరణతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.అనంతరం సోలిపేట మహేందర్ గౌడ్ దంపతుల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు అన్నప్రసాదం అందించడం ద్వారా వారు సేవాభావాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా మహేందర్ గౌడ్ దంపతులు మాట్లాడుతూ దుర్గామాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అమ్మవారి పూజలు, సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ఎంతో సంతృప్తినిస్తుందని పేర్కొన్నారు. భక్తిభావంతో నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలు ప్రజల్లో ఆధ్యాత్మిక చింతనతో పాటు ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. భవిష్యత్తులోనూ అమ్మవారి ఆశీస్సులతో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని అన్నారు.అమ్మవారి దర్శనం, ప్రత్యేక పూజలు, అన్నప్రసాద వితరణతో మండల కేంద్రంలో భక్తి వాతావరణం నెలకొంది.

ఏన్కుర్ మండలాన్ని కూడా కరువు మండలాల జాబితాల్లో చేర్చాలి.

- **రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ డిమాండ్**



నిత్యం నిఘా, ఏన్కుర్, అక్టోబర్ 18 : సీతారామ ప్రాజెక్ట్ అన్ని డిజైన్ లో పూర్తి చేసి ఖమ్మం జిల్లా ను సస్యశ్యామలం చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఏన్కుర్ మండల కేంద్రంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎల్ నినో ప్రభావంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. పంటలు పండే పరిస్థితి లేదు. తీవ్ర కరువు తో పాటు త్రాగు, సాగు నీళ్ల సమస్య ఏర్పడుతుంది. ప్రభుత్వం ముందస్తూ చర్యలూ తీసుకోలేదు. కరెంట్ కటింగులతో మోటార్లు కలిపోతున్నాయని కరెంట్ కష్టాలతో రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కుంటున్నారు.గోదావరి నీళ్లతో ఖమ్మం జిల్లా ను సస్యశ్యామలం చేసి సీతారామ ప్రాజెక్ట్ పూర్తి చేస్తే ఖమ్మం జిల్లా కు కరువు సమస్య ఉండక పోయేది కాదని ఆయన అన్నారు.సీతారామ ప్రాజెక్ట్ సత్వరమే పూర్తి చేసి ఖమ్మం జిల్లా ని సస్యశ్యామలం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు, మహ్మద్ సలాం, మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్ కుమార్, జిల్లా సమితి సభ్యులు అమరనే ని వీరభద్రం, మండల నాయకులు మాదినేని వెంకన్న, తాళ్లూరి రమణ, మాదినేని నరసింహారావు, కొమ్మినేని నర్సింహారావు, బోగినబోయన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

మంథని డిపోలో వైభవంగా దుర్గామాత పూజ

- **నవరాత్రి వేడుకల్లో పాల్గొన్న డిపో కార్మికులు**





నిత్యం నిఘా, మంథని, అక్టోబర్ 18 : మంథని ఆర్టీసీ డిపోలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత పూజను ఘనంగా నిర్వహించారు. డిపో కార్మికుల సహకారంతో ప్రతి ఏటా డిపో ప్రాంగణంలోని దుర్గామాత ఆలయం వద్ద నిర్వహించే ఈ పూజా కార్యక్రమంలో భారీ సంఖ్యలో కార్మికులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ జ్ఞానేశ్వర్, ఎస్టీఐ వర్జిలాల్, ఏఎంఎఫ్ వెంకటేశ్వర్లు, తెలంగాణ మజ్దూర్ యూనియన్ డిపో ప్రధాన కార్యదర్శి కేకే రెడ్డి, మునీర్, రమేష్, గ్యారేజ్ సెక్రటరీ కృష్ణ, శ్రీనివాస్, విజయ్, మెకానిక్ విజయ్, కుమార్, ఎంప్లాయీస్ యూనియన్ సెక్రటరీ గంధం రమేష్, రాజబాబు, సెక్యూరిటీ కానిస్టేబుల్ రాకేష్, నంది సాగర్, మంత్రి పోచయ్య, వెంకటస్వామి, సతీష్, ఏడీసీలు ఎన్. అంజయ్య, ఎం. రాములు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభించిన ఎస్ఐ రాజ్‌కుమార్

- **ప్రతాప్ యూత్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి టోర్నమెంట్.. నూతన ఎస్ఐకి ఘన సన్మానం**





పర్వతగిరి, అక్టోబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి):వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలో ప్రతాప్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌ను పర్వతగిరి ఎస్సై పి. రాజ్‌కుమార్ ప్రారంభించారు. ప్రతాప్ యూత్ సభ్యుల ఆహ్వానం మేరకు ఫైనల్ మ్యాచ్‌కు హాజరైన ఆయన వాలీబాల్‌ను సర్వీస్ చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై పి. రాజ్‌కుమార్‌ను ప్రతాప్ యూత్ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. క్రీడలు యువతలో ఐక్యత, క్రమశిక్షణ, స్నేహభావాన్ని పెంపొందించడంతో పాటు శారీరక దృఢత్వానికి దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. జిల్లా స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులు తమ ప్రతిభను చాటుతూ ఉత్సాహంగా పోటీపడ్డారు. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుని, క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కుసం రాంచందర్, ప్రతాప్ యూత్ సభ్యులు, టోర్నమెంట్ నిర్వాహకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

పూల సింగిడితో పుడమి మురిసె

- **గంగమ్మ చెంతకు గౌరమ్మ చేరే వేళ.. ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు**





ఏటూరునాగారం, అక్టోబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి):తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగను ఆదివారం ఏటూరునాగారం మండల కేంద్రంతో పాటు మండలవ్యాప్తంగా మహిళలు ఘనంగా జరుపుకున్నారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలతో పుడమి పూలవనంలా మురిసిపోయింది. ఆడపడుచులు సంప్రదాయ దుస్తులు ధరించి, ఆటపాటలతో సందడి చేస్తూ బతుకమ్మ సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని బొడ్రాయి సెంటర్, రామాలయం, శివాలయం, క్రాస్‌రోడ్డు, బస్టాండ్ సెంటర్, ఓంకార్ వీధి, ముత్యాలమ్మ గుడి ప్రాంగణం, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం తదితర ప్రాంతాల్లో మహిళలు బతుకమ్మలను పేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూలతో అలంకరించిన బతుకమ్మల మధ్య గౌరమ్మను భక్తిశ్రద్ధలతో పూజించి, సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా నృత్యాలు చేశారు. అనంతరం బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్లి గంగమ్మ ఒడిలో నిమజ్జనం చేసి పండుగను భక్తిభావంతో ముగించారు. ఈ వేడుకల్లో మహిళలు, రాజకీయ ప్రముఖులు, అధికారులు, స్థానిక ప్రజలు, పుర ప్రముఖులు తదితరులు పాల్గొని సద్దుల బతుకమ్మ సంబరాల్లో భాగస్వాములయ్యారు.

బతుకమ్మ ఘాటు అభివృద్ధికి నోచుకునేనా?

- **అన్నారం పెద్ద చెరువుకు సీసీ రోడ్డు వేయాలి**
- **పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని మహిళలు, స్థానికుల విజ్ఞప్తి**



పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి

తాడ్వాయి, అక్టోబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాటాపూర్‌లోని రామాలయం ఆవరణలో సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆడపడుచులు ఒక్కపొద్దు ఉపవాసంతో నిష్ఠ, నియమాలను పాటిస్తూ సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో సంబరాలు జరుపుకున్నారు. అనంతరం బతుకమ్మల నిమజ్జనం కోసం సమీపంలోని అన్నారం పెద్ద చెరువు వద్దకు చేరుకున్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన మహిళలు కులమతాలకు అతీతంగా కలిసిమెలిసి బతుకమ్మ ఆడుతూ, పాటలు పాడుతూ వేడుకలను నిర్వహించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేశారు.

రోడ్డు లేక ఇబ్బందులు

అన్నారం పెద్ద చెరువు వద్ద ఉన్న బతుకమ్మ ఘాటు గుట్టపై ఉండటంతో అక్కడికి చేరుకునేందుకు సరైన రహదారి సౌకర్యం లేదని మహిళలు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది బతుకమ్మ నిమజ్జనంతో పాటు వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు కూడా ఇదే ప్రాంతంలో నిర్వహిస్తున్న నేపథ్యంలో రహదారి లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు ఘాటు వద్దకు చేరుకోవడానికి అవస్థలు పడుతున్నారని పేర్కొంటున్నారు.

పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి

బతుకమ్మ ఘాటు వరకు సీసీ రోడ్డు నిర్మించి, పరిసర ప్రాంతాన్ని అభివృద్ధి చేసి పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దాలని మహిళలు, స్థానికులు కోరుతున్నారు. ఘాటు సమీపంలోనే ఆంజనేయస్వామి ఆలయం ఉండటంతో రహదారి, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తే భక్తులు, పర్యాటకుల రాకపోకలు పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. స్థానిక మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ తీసుకుని ఈ ప్రాంత అభివృద్ధికి నిధులు మంజూరు చేయించేలా కృషి చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. బతుకమ్మ, వినాయక నిమజ్జనాలకు ఉపయోగపడటంతో పాటు భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా సంబంధిత అధికారులు, ప్రభుత్వం స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఏళ్లుగా ఎదురవుతున్న రహదారి సమస్యకు పరిష్కారం చూపి, అన్నారం పెద్ద చెరువు పరిసర ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని స్థానికులు ఆశిస్తున్నారు.

మడికొండలో వైభవంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

- **సంప్రదాయ దుస్తుల్లో మహిళల ఆటపాటలు.. గంగమ్మ ఒడికి చేరిన బతుకమ్మలు**



మడికొండ, అక్టోబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): గ్రేటర్ వరంగల్ 64వ డివిజన్ మడికొండలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. మహిళలు వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి సాయంత్రం మెట్టుగుట్ట వద్దకు చేరుకున్నారు. అక్కడ బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో ఆనందోత్సాహాల మధ్య వేడుకలను జరుపుకున్నారు.అనంతరం 'పోయిరావమ్మా బతుకమ్మ' అంటూ బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్లి గంగమ్మ ఒడిలో నిమజ్జనం చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో మడికొండలో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా నిర్వహించారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com